

26న ట్రాక్టర్ల ర్యాలీని జయప్రదం చేయండి

ఎపి రైతుసంఘం

ఉంగుటూరు : కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు మద్దతు ధరల గ్యారంటీ చట్టం, రైతు రుణమాఫీ చట్టం తీసుకురావాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా సంయుక్త కిసాన్ మోర్చా పిలుపులో భాగంగా ఈ నెల 26 న ఏలూరులో జరుగుతున్న రైతు ట్రాక్టర్ల ర్యాలీని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. స్థానిక కైకరంలో తూర్పు వీధి ఎల్‌సి కళ్యాణ మండపంలో ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం, ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం ఆధ్వర్యంలో రైతుల సమావేశం మంగళవారం నిర్వహించారు. సీనియర్ నాయకులు గుత్తికొండ వెంకటకృష్ణారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో కె.శ్రీనివాస్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం జిల్లా కన్వీనర్ కొర్ని అప్పారావు, జిల్లా కోకన్వీనర్ వెజ్జు శ్రీరామచంద్రమూర్తి, నేతలు చిత్తా వెంకటేశ్వరరావు, వరి శ్రీరాములు, పొడుగు రాజు, మొగల అప్పారావు, ఆడపా సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆధునికీకరణ జరిగేనా..!

డెల్టా ఆధునికీకరణపై కొనసాగుతున్న నిర్లక్ష్యం

ఇప్పటికీ వేసవిలో చేపట్టబోయే పనులపై స్పష్టత కరువు

వైసిపి ప్రభుత్వం వచ్చాక పూర్తిగా అటకెక్కిన పనులు

ఎక్కడకక్కడ పంట కాలువల్లో పూడిక

ప్రతియేటా వేలాది ఎకరాలు ముంపుబారిన


ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

పంట కాలువల ఆధునికీకరణపై ఈ ఏడాదీ సందిగ్ధ పరిస్థితి కన్పిస్తోంది. రాబోయే వేసవిలో డెల్టా ఆధునికీకరణకు సంబంధించి చేపట్టబోయే పనులకు సంబంధించి, టెండర్ల ప్రక్రియకు సంబంధించిన స్పష్టత లేదు. ప్రస్తుత పరిస్థితులను పరిశీలిస్తే ఈ ఏడాదీ డెల్టా ఆధునికీకరణ పనులపై ప్రభుత్వం చేతులెత్తేసినట్లేనా అనే చర్చ రైతుల్లో నెలకొంది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా డెల్టా పరిధిలో 5.29 లక్షల ఎకరాల్లో రైతులు వరిసాగు చేస్తున్నారు. ఈ సాగు మొత్తానికి గోదావరి నుంచి పంట కాలువల ద్వారా వచ్చే సాగునీరే ఆధారం. 11 ప్రధాన కాలువలు, 300కుపైగా పిల్ల కాలువల ద్వారా సాగునీటి సరఫరా జరుగుతోంది. ఏడాదికి దాదాపు 20 లక్షలకు పైగా మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి జరుగుతోంది. ఇంత పెద్దఎత్తున పంట పండించేందుకు ఆధారమైన కాలువల ఆధునికీకరణను వైసిపి ప్రభుత్వం పూర్తిగా పక్కన పెట్టేసింది. తూడు, గుర్రపుడెక్క వంటివి తీయడం తప్ప ముఖ్యమైన కాలువల్లో మెరకతీసే పనులు మాత్రం నామమాత్రంగా మారాయి. 2007లో అప్పటి ప్రభుత్వం డెల్టా ఆధునికీకరణ పనుల నిమిత్తం రూ.1464.44 కోట్లు కేటాయించింది. ఇప్పటి వరకూ దాదాపు రూ.800 కోట్లు విలువ చేసే పనులు జరిగినట్లు లెక్కలు చెబుతున్నాయి. ఇంకా రూ.600 కోట్ల విలువ చేసే ఆధునికీకరణ పనులు జరగాల్సి ఉంది. 2019లో అప్పుడే వైసిపి ప్రభుత్వం ఏర్పడటంతో ఆధునికీకరణ పనుల ఊసే ప్రస్తావన లేకుండాపోయింది. 2020లో రూ.250 కోట్ల విలువైన పనులకు సంబంధించి జిల్లా ఇరిగేషన్ అధికారులు నివేదికలు తయారు చేసి ప్రభుత్వ అనుమతి కోసం పంపగా స్పందన లేదు. దీంతో పనులు జరగని పరిస్థితి ఏర్పడింది. 2021లో రూ.300 కోట్ల పనులకు సంబంధించి ప్రతిపాదనలు పంపగా అనుమతి రాలేదు. దీంతో మూడేళ్ల ఆధునికీకరణ పనులు అనేవి ముందుకు సాగిన దాఖలాల్లేవు. జిల్లా సాగునీటి సలహా మండలి సమావేశాల్లో మంత్రులు మాట్లాడుతూ జనవరి నెలఖారులకల్లా టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి కాలువలు మూసివేసిన వెంటనే పనులు చేయాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చేస్తుంటారు. అయితే క్షేత్రస్థాయిలో పనులు మాత్రం జరిగిన పరిస్థితి లేదు. ఈ ఏడాదిసైతం ఆధునికీకరణ పనులు జరుగుతాయా.. లేదా అనే అనుమానాలు నెలకొన్నాయి. వచ్చే ఏడాది ఎన్నికలు జరగనుండటంతో ఆ సంవత్సరంలో ఆధునికీకరణ పనులు జరగడం కష్టమే.



ప్రతియేటా వేలాది ఎకరాలు మునక

డెల్టా ఆధునికీకరణ జరగకపోవడంతో ప్రతియేటా ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వేలాది ఎకరాల్లో పంట పొలాలు ముంపునకు గురవుతున్నాయి. చిన్నపాటి వర్షం వస్తే చాలు నారుమడులు, నాట్లు ముంపుబారిన పడుతున్నాయి. దీంతో రైతులు తీవ్ర నష్టాలను చవిచూస్తున్నారు. రబీలో ప్రతియేటా నీటిఎద్దడి సమస్యతో సతమతమవుతున్నారు. ఖరీఫ్‌లో భారీ వర్షాలు కురిసినప్పుడు పొలాల్లో నీరు కిందకు పారక పంటలు దెబ్బతింటున్నాయి. పరిస్థితి ఇంత దారుణంగా ఉన్నా ఆధునికీకరణ గురించి మాత్రం ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. ఈ ఏడాదైనా ప్రభుత్వం ఆధునికీకరణ పనులపై దృష్టి సారించాలని రైతులు కోరుతున్నారు.



గణపవరంలో..

సమస్యలు పరిష్కరించాలని

అంగన్వాడీల ఆందోళన

ప్రజాశక్తి - ఏలూరు

తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అంగన్వాడీలు మంగళవారం స్థానిక ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా నాయకులు పి.హైమావతి మాట్లాడుతూ ప్రభుత్వం రెండు నెలలుగా జీతాలు చెల్లించకపోవడంతో అంగన్వాడీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం అంగన్వాడీలకు ఐదు లక్షలు రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని, వేతనంలో సగభాగం పెన్షన్‌గా ఇవ్వాలని, ఫేస్ యాప్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నేతలు టి.రజిని, సిహెచ్.ఆందోళనమ్మ, జి.విజయలక్ష్మి, వి.కనకదుర్గ, వెంకటలక్ష్మి, టి.సుకన్య, వి.వెంకటరమణ, జైనాబి తదితరులు పాల్గొన్నారు.

కైకలూరు రూరల్: స్థానిక సిడిపిఒ కార్యాలయం వద్ద అంగన్వాడీలు మంగళవారం ఆందోళన చేపట్టారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ మెనూ ఛార్జీలు పెంచాలని, జిఒ నెం.1ని రద్దు చేయాలని నినాదాలు చేశారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఐసిడిఎస్ అధికారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో నేతలు కూరెళ్ల లాజరు, పి.సుజాత, జి.జ్యోతిరాణి, బిడి.సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

గణపవరం: అంగన్వాడీ కార్యకర్తలకు ఫేస్ యాప్ రద్దు చేయాలని అంగన్వాడీలు మంగళవారం స్థానిక ఐసిడిఎస్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఏలూరు జిల్లా అధ్యక్షురాలు ఎమ్‌డి.హసీనాబేగం, పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షురాలు కె.ఝాన్సీలక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన సెల్ ఫోన్లకు గ్రామాల్లో నెట్ సౌకర్యం లేకపోవడంతో పనిచేయడం లేదన్నారు. రకరకాల యాప్‌లు తీసుకొచ్చి పని భారం పెంచారని, వేతనం పెంచడం లేదని విమర్శించారు. అంగన్వాడీలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఐసిడిఎస్ సూపర్‌వైజర్ తులసికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నేతలు బి.రామకోటి, జయలక్ష్మి, అంగన్వాడీలు పాల్గొన్నారు.

చింతలపూడి: పెండింగులో ఉన్న టిఎ, డిఎ బకాయిలను విడుదల చేయాలని, హెల్పర్లకు ప్రమోషన్లు కల్పించాలని అంగన్వాడీ ప్రాజెక్ట్ అధ్యక్ష కార్యదర్శులు పి.సరోజిని, పి.మాణిక్యం డిమాండ్ చేశారు. స్థానిక ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో అంగన్వాడీలు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బిజెఎస్.కుమారి, బి.ఫణివర్ధిని, కవిత, అరుణ, మార్తమ్మ, హేమలత, పాప రత్నం, జి.సరళ పద్మావతి, పద్మ పాల్గొన్నారు.

కుక్కునూరు: అంగన్వాడీల సమస్యలు తక్షణమే పరిష్కరించి బకాయి వేతనాలు విడుదల చేయాలని సిఐటియు మండల కార్యదర్శి యర్నం సాయికిరణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం అంగన్వాడీలు స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేసి అనంతరం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సాయికిరణ్ మాట్లాడారు. ధర్నాలో అంగన్వాడీలు రాయి రమణ, నాగలక్ష్మి, కణితి మంగ, విమల, జయ, జయసుధ, విజయ, రూపాలత, అలివేలు, అన్నపూర్ణ, నాగమణి, ఝాన్సీ, సౌజన్య పాల్గొన్నారు.


బుట్టాయగూడెం: స్థానిక ఐసిడిఎస్ కార్యాలయం వద్ద మంగళవారం అంగన్వాడీలు ధర్నా నిర్వహించారు. ధర్నానుద్దేశించి సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి మొడియం నాగమణి, జీలుగుమిల్లి మండల కార్యదర్శి సిహెచ్.కొండలరావు మాట్లాడుతూ అంగన్వాడీల సమస్యలు తక్షణం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం యుడిసి కృష్ణవేణికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కృపామణి, తెల్లం రామలక్ష్మి, కె.పుష్ప, నూర్జహాన్, అంగన్వాడీలు పాల్గొన్నారు.

పేదల సాగు భూములకు పట్టాలివ్వాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి

ప్రజాశక్తి - టి.నరసాపురం

ఆదివాసీలు, దళితులు, పేదలు సాగుచేసుకుంటున్న భూములకు పట్టాలివ్వాలని సిపిఎం జిల్లా కార్యాదర్శి ఎ.రవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మల్లప్పగూడెంలో సిపిఎం మండల కమిటీ సమావేశం పార్టీ సభ్యురాలు మడకం సుధారాణి అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న రవి మాట్లాడుతూ మండలంలో ఆదివాసీలు, దళితులు, పేదలు సాగు చేసుకున్న భూములకు పట్టలివ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రదర్శనలు, ర్యాలీలు జరగకుండా తీసుకొచ్చిన జిఒ1ని రద్దు చేయాలన్నారు. జగనన్న ఇళ్ల నిర్మాణాలకు రూ.5 లక్షలు చెల్లించాలన్నారు. ప్రజలపై పన్నుల భారం తగ్గించాలన్నారు. వ్యవసాయ మోటార్లకు మీటర్లు బిగించే నిర్ణయాన్ని వెంటనే ఆపాలన్నారు. పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఏడాదిలో పార్టీ చేపట్టిన ఉద్యమాలపై సమీక్షించారు. రానున్న కాలంలో చేపట్టబోయే ఉద్యమాలపై కార్యచరణ రూపొందించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పిల్లి రామకృష్ణ, మండల కార్యదర్శి తుమ్మల సత్యనారాయణ, మండల కమిటీ సభ్యులు అనుముల మురళీ, పి.సుర్యారావు, సరియం దుర్గమ్మ పాల్గొన్నారు.



గణపవరం మండలంలో..

ప్రజాసంక్షేమమే సిఎం జగన్ లక్ష్యం

ప్రజాశక్తి - గణపవరం

ప్రజా సంక్షేమమే లక్ష్యంగా జగన్ ప్రభుత్వం పని చేస్తుందని ఉంగుటూరు శాసనసభ్యులు పుప్పాల శ్రీనివాసరావు(వాసుబాబు) అన్నారు. మంగళవారం కేశవరం, మల్లపురాజుపేట గ్రామాల్లో జరిగిన గడపగడపకూ ప్రభుత్వంలో పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచులు నక్కా సూర్య బంగారయ్య, ఎం.కామేశ్వరి, నాగేశ్వరరావు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

ముదినేపల్లి : రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి మరోసారి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలు ఆశీర్వదించాలని ఎంఎల్‌ఎ దూలం నాగేశ్వరరావు అన్నారు. ముదినేపల్లిలో మంగళవారం గడపగడపకూ మనప్రభుత్వం కార్యక్రమం ఎంఎల్‌ఎ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి వైసిపి ప్రభుత్వంలోని సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా పలుచోట్ల ప్రజలనుద్దేశించి ఆయన మాట్లాడుతూ పేదల సంక్షేమమే ధ్యేయంగా జగనన్న పాలన కొనసాగుతోందన్నారు. రాష్ట్రంలో ప్రజలు జగనన్న పాలనలో సుఖసంతోషాలతో జీవిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ, జెడ్‌పిటిసి సభ్యులు ఈడే వెంకటేశ్వరమ్మ, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంటా సంధ్య, వైస్ ఎంపిపిలు సిహెచ్.సునీత, రాధా పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి వైద్యవిద్యార్థి సాయం


ప్రజాశక్తి - ముదినేపల్లి

ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన మండలంలోని కాకరవాడకు చెందిన బొర్రా బాలాజీ(23) కుటుంబ సభ్యులకు ముదినేపల్లికి చెందిన వైద్య విద్యార్థిని అంబుల వైష్ణవి మంగళవారం ఆర్థిక సాయం అందచేశారు. చదువు నిమిత్తం తాను కాలేజీలో ఉడటంతో తన తండ్రి డాక్టర్ మనోజ్ ద్వారా వెంటనే తక్షణ సాయంగా రూ.ఐదువేలు నగదు, నిత్యావసర వస్తువులు అందజేశారు. ఈ సందర్భంగా వైష్ణవి మాట్లాడుతూ దాతలు ముందుకు వచ్చి మృతుని కుటుంబానికి సాయం చేయాలని కోరారు.



సాయం అందిస్తున్న విద్యార్థిని తండ్రి

ఆంతర్యం... అయోమయం..!



సోము వీర్రాజుకు వినతిని అందిస్తున్న ఎంఆర్‌పిఎస్ నేతలు

రాజకీయ వైఖరిపై స్పష్టత లేని బిజెపి నేతల ప్రసంగాలు

టిడిపి, వైసిపిలను ఓడించాలని పిలుపు

మాదిగలకు ఏం చేశారని ప్రశ్నించిన ఎంఆర్‌పిఎస్ నేతలు

భీమవరంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సమావేశం

ప్రజాశక్తి - భీమవరం

'వచ్చే సంవత్సరంలో ఎన్నికలు జరగనున్నాయి. ఈ దశలో జరగనున్న రాష్ట్రస్థాయి సమావేశాల్లో కచ్చితంగా ఆ ఎన్నికలకు సంబంధించిన రాజకీయ వైఖరిపై చర్చించి నేతలు దిశానిర్దేశం చేస్తారు అని ఆశించిన బిజెపి శ్రేణులను మరింత గందరగోళంలోకి నెట్టింది ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సమావేశం. స్థానిక ఆనంద ఫంక్షన్ హాలులో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సమావేశం మంగళవారం జరిగింది. సమావేశానికి రాష్ట్ర అధ్యక్షులు సోము వీర్రాజు అధ్యక్షత వహించగా కేంద్ర మంత్రులు మురళీధర్, పవర్, బిజెపి జాతీయ కార్యదర్శి సునీల్ ధియోధర్, రాజ్యసభ సభ్యులు సిఎం రమేష్, జివిఎల్.నరసింహారావు, ఎంఎల్‌సిలు పివిఎన్.మాధవ్, నారాయణరెడ్డి, జాతీయ నేత శివప్రకాష్ హాజరయ్యారు. సమావేశంలో ఇప్పటి వరకూ వ్యవహరించిన రాజకీయ వైఖరి, రానున్న రోజుల్లో అవలంబించాల్సిన రాజకీయ వైఖరి గురించి ఎటువంటి చర్చా లేకపోవడం గమనార్హం. గత టిడిపి ప్రభుత్వ పాలనను, ప్రస్తుత వైసిపి ప్రభుత్వ పాలనను విమర్శిస్తూ నేతల ప్రసంగాలు సాగాయి. 2024 ఎన్నికల్లో టిడిపితో పొత్తు ఉంటుందని కొందరు నేతలు చెబుతున్న తరుణంలో అధికార వైసిపితోపాటు టిడిపిపైనా నేతలు ఘాటైన విమర్శలు చేయడం చర్చనీయాంశమైంది. జనసేన గురించి ప్రస్తావించని నేతలు మరి ఆ పార్టీ నేత పవన్‌కళ్యాణ్ ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలనీయబోనని చెబుతున్న మాటల ప్రకారం టిడిపితో జతకట్టేందుకు సిద్ధమవుతారా అనే దానిపైనా నోరుమెదప లేదు. మొత్తంగా అధిష్టానం ఆంతర్యం ఏమిటో రాష్ట్ర కార్యవర్గ సమావేశాల సందర్భంగానూ వెల్లడించకపోవడం ఆ పార్టీలో నెలకొన్న సందిగ్ధతకు నిదర్శనమని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు.

ఎస్‌సి వర్గీకరణ బిల్లు ఏమైంది: ఎంఆర్‌పిఎస్

అధికారం చేపట్టిన వంద రోజుల్లో ఎస్‌సి వర్గీకరణ బిల్లును తీసుకొస్తామని చెప్పిన బిజెపి ఎనిమిదేళ్ల కాలంలో మాదిగలకు ఏం చేసిందని ఎంఆర్‌పిఎస్ జాతీయ అధ్యక్షులు మున్నంగి నాగరాజు బిజెపి రాష్ట్ర అధ్యక్షులు సోము వీర్రాజును నిలదీశారు. బిల్లును వెంటనే పార్లమెంట్లో పెట్టాలని వారు వీర్రాజుకు వినతిపత్రం అందించారు. కేంద్ర మంత్రి మురళీధరన్‌కు వినతిపత్రం ఇచ్చేందుకు నేతలు అంగీకరించకపోవడంతో ఎంఆర్‌పిఎస్ నేతలు ఆందోళనకు దిగారు. దీంతో వారు మంత్రిని కలిసేందుకు అనుమతించడంతో ఆయనకూ వినతిపత్రం అందించి సమస్య వివరించారు. కార్యక్రమంలో నాగరాజు మాదిగతోపాటు ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు సురేష్ మాదిగ, ఎంఎస్‌పి జిల్లా సహాయ కార్యదర్శి రాజారావు, ఉమ్మడి జిల్లా కార్యదర్శి చిన్న సుబ్బారావు, రాజారావు పాల్గొన్నారు.

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం

ప్రజాశక్తి - నూజివీడు

ప్రస్తుత పరిస్థితుల్లో నిరుద్యోగ సమస్యకు పరిష్కారానికి యువత పరిశ్రమల స్థాపనకు ముందుకు రావాలని, ఇందుకు ప్రభుత్వ ప్రోత్సాహం ఉంటుందని జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజరు పి.ఏసుదాసు చెప్పారు. జిల్లాలోని ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు పరిశ్రమల స్థాపనపై అవగాహన కల్పించేందుకు, పరిశ్రమల ద్వారా అమలవుతున్న పథకాల గురించి వివరించేందుకు మంగళవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంటర్ ప్రెన్యూర్ షిప్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం (ఇడిపి) నిర్వహించారు. ఈ సందర్భంగా జిఎం మాట్లాడుతూ పరిశ్రమలు నెలకొల్పేవారు ముందుగా ఆ పరిశ్రమపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. తమకు అనుభవమున్న, మార్కెట్‌లో డిమాండ్ ఉన్న ఉత్పత్తులనే ఎంచుకోవాలన్నారు. ఉత్పత్తులు నాణ్యతగా ఉండేలా చూసుకోవాలన్నారు. పరిశ్రమల స్థాపనతో తాము ఉపాధి పొందడమేకాక మరికొంతమంది నిరుద్యోగులకు ఉపాధి కల్పించే అవకాశం ఉంటుందని తెలిపారు. పరిశ్రమల స్థాపనకు కావాల్సిన అనుమతుల కోసం 'సింగిల్ డెస్క్' పోర్టల్‌లో దరఖాస్తు చేస్తే 21 రోజుల్లోపు అనుమతులు లభిస్తాయన్నారు. కొత్తగా పరిశ్రమలు నెలకొల్పిన వారికి ప్రభుత్వం వివిధ పథకాలను అమలు చేస్తుందన్నారు. ఐడిపి 2020-23 పారిశ్రామిక విధానం వచ్చే మార్చి 31తో ముగుస్తుందన్నారు. ఈ పథకం ద్వారా ఎంఎస్‌ఎంఇ యూనిట్లు స్థాపించే జనరల్ కేటగిరీ వారికి 15 శాతం, బిసి, మైనార్టీ మహిళలకు 35 శాతం, ఎస్‌సి, ఎస్‌టిలకు ప్రాజెక్టు వ్యయంలో 45 శాతం సబ్సిడీగా లభిస్తుందన్నారు. లీడ్ బ్యాంక్ మేనేజర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ తీసుకున్న ఋణాలను సక్రమంగా బ్యాంకులకు తిరిగి చెల్లించాలన్నారు. ప్రధానమంత్రి రోజ్‌గార్ యోజన పథకం ద్వారా తయారీ రంగానికి రూ.50 లక్షల వరకూ, సేవా రంగానికి రూ.20 లక్షల వరకూ రుణం పొందొచ్చన్నారు.

అభ్యర్థి వయసు 18 సంవత్సరాలు నిండి ఉండాలని, ఆదాయ పరిమితి లేదన్నారు. ఎపి ఫైనాన్షియల్ కార్పొరేషన్ ఏలూరు డిప్యూటీ మేనేజర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎంటర్ ప్రెన్యూర్ ఎంచుకున్న యాక్టివిటీకి సంబంధించిన సంపూర్ణ ప్రాజెక్టు రిపోర్టు తయారు చేసుకుని తమను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల కేంద్రం అసిస్టెంట్ డైరెక్టర్ సుమధురవాణి, ఎంపిడిఒ సుందరి, ఇండస్ట్రియల్ ప్రమోషన్ ఆఫీసర్ నాగేంద్ర భూపాల్ పాల్గొన్నారు.

చేతివృత్తిదారులకు జనాభా ప్రాతిపదికన బడ్జెట్ కేటాయించాలి



సదస్సులో నాయకులు, ప్రతినిధులు

ప్రజాశక్తి - ఏలూరు

చేతివృత్తిదారులకు రాష్ట్ర బడ్జెట్‌లో జనాభా ప్రాతిపదికన రూ.52వేల కోట్లు కేటాయించాలని మత్స్యకార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొల్లేటి శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వృత్తిదారుల జిల్లా సదస్సు స్థానిక యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో కమిటీ కో కన్వీనర్ పత్తిపాటి రామకృష్ణ అధ్యక్షతన మంగళవారం జరిగింది. ఈ సదస్సులో ముఖ్యవక్తగా పాల్గొన్న కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతీవృత్తిదారుని కుటుంబ సంక్షేమం కోసం రూ.25 వేలు ఆర్థిక సాయం (నగదు బదిలీ) అందించాలన్నారు. వారి కుటుంబాలకు నెలకు 200 యూనిట్ల కరెంటు ఉచితంగా ఇవ్వాలని కోరారు. వృత్తినిర్వహిస్తూ ఏదైనా మరణించిన వారి కుటుంబ సభ్యులకు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని కోరారు. వృత్తిదారుల ఫెడరేషన్లు, కార్పొరేషన్లకు విధులు నిర్ణయించి, నిధులు కేటాయించి ఖర్చు చేయాలన్నారు. జనాభా ప్రాతిపదికన వృత్తిదారుల రక్షణ, సంక్షేమం, అభివృద్ధికి నిధులు కేటాయించాలని, మత్స్యకారుల జీవితాలను నాశనం చేసే 217 జిఒను రద్దు చేయాలని కోరారు. 343 జిఒ ప్రకారం పంచాయతీ చెరువులు స్థానిక మత్స్యకారుల సొసైటీలకు నామమాత్రపు లీజుకు ఇవ్వాన్నారు. హబ్ (ఫిష్‌ఆంధ్రా) పథకాన్ని నిలుపుదల చేయాలని కోరారు. చేపల వేట నిషేధ భృతిని రూ.20 వేలకు పెంచి సంప్రదాయ వేటగాళ్లు, చేపలు అమ్మే వారికి కూడా అమలు చేయాలని డిమాండ్ చేశారు. సబ్సిడీపై డీజిల్ రూ.20కు సరఫరా చేయాలని, గిట్టుబాటు ధర నిర్ణయించి బోర్డు పెట్టాలని కోరారు. చేనేతపై జిఎస్‌టి పూర్తిగా రద్దు చేయాలని, ప్రతీ చేనేత కార్మికునికి నేతన్న హస్తం ఇవ్వాలని, ప్రతీ చేనేత కార్మికునికి మగ్గం షెడ్డుతో కూడిన చెరువులు, దోభీ ఘాట్ స్థలాలు పిఒపిలో చేర్చి రజకులకు పూర్తి హక్కు కల్పించాలని డిమాండ్ చేశారు. జగనన్న చేదోడు పథకం వృత్తిదారులందరికీ ఇవ్వాలన్నారు. రజకులకు సామాజిక రక్షణ చట్టం (ఎస్‌సి, ఎస్‌టి) తరహాలో ఏర్పాటు చేయాలని, జిఒ 27 ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం అన్ని డిపార్ట్‌మెంట్లలో ఖాళీగా ఉన్న దోభీ పోస్టులను భర్తీ చేయాని కోరారు. కల్లుగీత వృత్తి అభివృద్ధి, ఆధునికీకరణకు నిపుణులతో కమిటీ వేయాలని, కల్లుగీత కార్పొరేషన్ పునరుద్ధరించి, ఆధునికీకరణ పరికరాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వ హామీ ప్రకారం దశలవారీ మద్యపాన నిషేధాన్ని అమలు చేయాలని, ఇఎంఐ లేకుండా వడ్డెర వృత్తిదారులకు రూ.5 లక్షల వరకూ కాంట్రాక్టర్లు ఇవ్వాలని, కంకర క్వారీలపై పూర్తి హక్కు వడ్డెర వృత్తిదారులకే కేటాయిస్తూ జిఒ విడుదల చేయాలని కోరారు. గొర్రెలకు డీవార్మింగ్ ఏడాదికి నాలుగుసార్లు ఇవ్వాలని, వ్యాధులకూ, వ్యాక్సిన్ సరిపడినంత సరఫరా చేయాలని, ప్రతి పంచాయతీ పరిధిలో వెటర్నరీ డాక్టర్లను ప్రమోట్ చేయాలని, గొర్రెలు, మేకల పెంపకందారులకు రూ.2 లక్షల యూనిట్‌గా 50శాతం సబ్సిడీతో ఇవ్వాలని కోరారు. క్షౌరవృత్తి చేసే ప్రతి వృత్తిదారునికి జగనన్న చేదోడు రూ.10 వేలు ఇవ్వాలని, ప్రతిక్షౌర వృత్తిదారునికి రాష్ట్ర ప్రభుత్వం స్టాల్స్ కేటాయించి కామన్ షెడ్ నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ నెల 30వ తేదీన విజయవాడలోని మాకినేని బసవన్నయ్య విజ్ఞాన కేంద్రం ఆడిటోరియంలో జరిగే చేతివృత్తిదారుల రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని, తద్వారా భవిష్యత్ కార్యాచరణ రూపొందించి పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

జిల్లా సదస్సులో ఎపి చేతి వృత్తిదారుల జిల్లా కన్వీనర్ పిచ్చుక ఆదిశేషు, నాయుడు బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు చందనాడ నందేశ్వరరావు, గొర్రెలు, మేకల పెంపకదారుల సంఘం ఏలూరు నగర కార్యదర్శి కొత్తల శివకుమార్, ఎపి కల్లుగీత కార్మిక సంఘం ఏలూరు నగర కార్యదర్శి శొంఠి శంకర్‌రావు, పి.నాంచారయ్య, శ్రీరామ్మూర్తి పాల్గొన్నారు.



రౌండ్‌టేబుల్ సమావేశానికి విచ్చేసిన నాయకులు

విభజన హామీలు నెరవేర్చాలి : డివైఎఫ్‌ఐ

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

రాష్ట్ర విభజన హామీలను నెరవేర్చాలని డివైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి జి.సూర్య కిరణ్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణ ప్రజాసంఘాల కార్యాలయంలో ఎఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి శివ అధ్యక్షతన విద్యార్థి, యువజన సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా డివైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి జి.సూర్యకిరణ్ మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యార్థి యువజన సంఘాల ఆధ్వర్యంలో జరుగుతున్న బస్సు యాత్రను జయప్రదం చేయాలని కోరారు. రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత బిజెపి ప్రభుత్వరంగ సంస్థలను ప్రయివేటీకరిస్తూ ప్రజాధనాన్ని బడాపెట్టుబడిదారులకు దానోహం చేస్తూ రాజ్యాంగ హక్కులను కాల రాస్తోందని విమర్శించారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని నమ్మించిన ప్రధాని నరేంద్ర మోడీ కరోనా నేపథ్యంలో చిన్న పరిశ్రమలకు ప్రోత్సాహం ఇవ్వకపోవడంతో లక్షలాది మంది ఉద్యోగాలు కోల్పోయారన్నారు. ప్రజలపై పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరల భారాలు మోపుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వస్తే రాష్ట్రంలో మద్యం నిషేధించి ప్రతీసంవత్సరం జాబ్ క్యాలెండర్ విడుదల చేసి లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని ఇచ్చిన హామీ విస్మరించారన్నారు. సిఎం జగన్ రాష్ట్ర ప్రజలను మోసం చేశారని విమర్శించారు. నాడు - నేడు పేరుతో విద్యాసంస్థలను అభివృద్ధి చేస్తున్నారని, కానీ డిఎస్‌సి ప్రకటించి, ఉపాధ్యాయులను భర్తీ చేయడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఉద్యోగాలను భర్తీ చేసి కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను, ప్రభుత్వరంగ సంస్థల ప్రయివేటీకరణను వ్యతిరేకించాలన్నారు. పోలవరం నిర్వాసితుల పునరావాస ప్యాకేజీ, రాష్ట్రానికి విభజన హామీల సాధనకు కేంద్రంపై ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రానున్న రోజుల్లో విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో రాష్ట్రంలో యువతను ఐక్యం చేసి పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టిఎన్‌ఎస్‌ఎఫ్ జిల్లా అధికార ప్రతినిధి పి.పవన్, ఎన్‌ఎస్‌యుఐ నాయకులు ఎ.దిలీప్, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు బి.యశ్వంత్, జి.మణి, డివైఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షులు బేతి కిషోర్ పాల్గొన్నారు.

రబీ పంట నమోదు వేగవంతం చేయాలి

ముదినేపల్లి: రబీపంట నమోదు త్వరితగతిన పూర్తిచేయాలని వ్యవసాయ సహాయ సంచాలకులు జి.వెంకటమణి కోరారు. ముదినేపల్లిలోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో మంగళవారం మండలంలోని గ్రామ వ్యవసాయ సహాయకులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎరువుల అమ్మకాలకు సంబంధించి ఆన్‌లైన్ ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. గ్రామాల్లో రబీ పొలంబడి కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. ఈ శిక్షణా కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి బొర్రా వేణుమాధవ్, అన్ని గ్రామాల వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.


ఆందోళన చేస్తున్న నాయకులు

ఇఎస్ఐ ఆసుపత్రిని ఏర్పాటు చేయాలి : సిఐటియు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

కార్మికులకు, ఉద్యోగులకు ఇఎస్ఐ ఆసుపత్రిని స్థానికంగా ఏర్పాటు చేయాలని సిఐటియు గౌరవ అధ్యక్షులు పి.సూర్యారావు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక ఆర్‌డిఒ కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో బి.బాలరాజు అధ్యక్షతన మున్సిపల్ వర్కర్స్‌తో కలిసి నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సూర్యారావు మాట్లాడుతూ జంగారెడ్డిగూడెం పరిసర ప్రాంతంలో కార్మికులు, ఉద్యోగులు అనేకమంది విధులు నిర్వహిస్తున్నారని, వీరందరికీ ఇఎస్ఐ కార్డులున్నప్పటికీ వినియోగించుకోవడానికి వీలులేకుండా పోయారు. ఇఎస్ఐ ఆసుపత్రి ప్రతీ 50 కిలోమీటర్లకు పట్టణ ప్రాంతాల్లో ఉండాలన్నారు. కానీ చాలా చోట్ల అమలు కావటం లేదని తెలిపారు. వేల సంఖ్యలో కార్మికులున్న జంగారెడ్డిగూడెంలో ఇఎస్ఐ ఆసుపత్రి లేకపోవడం దారుణమన్నారు. అత్యవసరమైతే ఏలూరు వెళ్ళాల్సి వస్తుందని వాపోయారు. ప్రయివేటు ఆసుపత్రికి సొంత ఖర్చులతో వెళ్ళాల్సి వస్తుందని వాపోయారు. అనంతరం ఆర్‌డిఒ ఝాన్సీరాణికి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి జి.లక్ష్మణ్, వెంకటేష్, పెంటయ్య, ప్రసాద్, మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డిఎస్‌పి అశోక్‌కుమార్ గౌడ్

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహనుండాలి

ప్రజాశక్తి - నూజివీడు

వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహనుండాలని నూజివీడు డిఎస్‌పి అశోక్ కుమార్‌గౌడ్ సూచించారు. 34వ రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా మంగళవారం స్థానిక బిస్ స్కూల్ ఆవరణలో విద్యార్థులకు రోడ్డు నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సిఐలు మూర్తి, అంకబాబు, విద్యార్థులు పాల్గొన్నారు.


రోగులకు అల్పాహారం అందిస్తున్న 'మానవత' సభ్యులు

రోగులకు అల్పాహారం పంపిణీ

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

స్థానిక ఏరియా ఆసుపత్రి రోగులకు మానవత సంస్థ అధ్యక్షులు మహంకాళి రంగ ప్రసాద్ ఆధ్వర్యంలో మంగళవారం అల్పాహారం పంపిణీ చేశారు. ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో రోగులు వంద మందికి టిఫిన్, పాలు అందించారు. ఈ సందర్భంగా రంగప్రసాద్ మాట్లాడుతూ దాతలు ఎల్ఐసి కృష్ణ మూర్తి ఆర్థిక సహాయంతో అల్పాహారం, పాలు పంపిణీ చేశామని తెలిపారు. ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బేబీ కమల మాట్లాడుతూ ప్రతిరోజూ ఉదయం రోగులకు ఇడ్లీ, పాలు అందించడంపై సంతోషం వ్యక్తం చేశారు. మానవత సంస్థ సేవలను కొనియాడారు. మానవత సంస్థకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వజ్ర కిరణ్, డాక్టర్ సునీత, మానవత ఉపాధ్యక్షురాలు త్రిపుర, జిల్లా కమిటీ సభ్యులు తాతారావు, జాయింట్ సెక్రటరీ కేదారేశ్వర రెడ్డి, గోపాల కృష్ణ, రమేష్ పాల్గొన్నారు.


ఇళ్ల నిర్మాణాలు పరిశీలిస్తున్న నాయకులు

జగనన్న ఇళ్లకు రూ.5 లక్షల రుణం ఇవ్వాలి

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

జగనన్న ఇళ్ల లబ్ధిదారులకు ఇంటి రుణం రూ.ఐదు లక్షలు మంజూరు చేయాలని సిపిఎం మండల నాయకులు సత్తు కోటేశ్వరరావు, షేక్ జహంగీర్‌బాషా డిమాండ్ చేశారు. మంగళవారం ఆగిరిపల్లిలో పార్టీ గ్రామ శాఖ ఆధ్వర్యంలో జగనన్న ఇళ్ల కాలనీలను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ పేద, మధ్యతరగతి ప్రజలకు ఇళ్ల స్థలాలు కేటాయించిన ప్రభుత్వం కేవలం రూ.1.80 లక్షలతో ఇల్లు నిర్మించుకోవాలని చెప్పడం దారుణమన్నారు. కాలనీల్లో మౌలిక వసతులు కల్పించాలని, జగనన్న ఇళ్ల స్థలాలు నివాసయోగ్యమైన చోట ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు షేక్ సుభానీ, పలువురు లబ్ధిదారులు పాల్గొన్నారు.

వృద్ధుల సంక్షేమ చట్టంపై అవగాహన కల్పించాలి

భీమడోలు: ప్రతీ గ్రామ సచివాలయం వద్ద ఈనెల 27న వృద్ధులకు వారి సంక్షేమ చట్టంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఎంపిడిఒ రాఘవన్ కోరారు. సచివాలయ పరిధిలోని వృద్ధులను ఆహ్వానించి వారి సంరక్షణ, పోషణ చట్టం గురించి వారికి వివరించాలన్నారు. వృద్ధుల హెల్ప్ లైన్ ద్వారా వివిధ ఆరోగ్య సమస్యలతో ఇబ్బంది పడే వృద్ధులకు వినికిడి పరికరాలు, చేతికర్రలు అందేలా చూడాలన్నారు.

నేరాలు - ఘోరాలు

అక్రమంగా తరలిస్తున్న ఆల్కహాల్ పట్టివేత

జీలుగుమిల్లి: మండలంలోని తాటియాకులగూడెం ఎస్ఇబి అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద మంగళవారం ఎస్ఇబి సిఐ మణికంఠ రెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన వాహన తనిఖీల్లో మెదక్ నుంచి విశాఖకు తరలిస్తున్న ఎనిమిది లీటర్ల ఎక్స్‌ట్రా న్యూట్రాల్ ఆల్కహాల్‌ను స్వాధీనం చేసుకున్నామని ఎస్ఇబి సిఐ మణికంఠరెడ్డి తెలిపారు. విఆర్ఒ బుల్లబ్బాయి అధ్వర్యంలో ఆల్కహాల్‌ను సీజ్ చేసి ట్యాంకర్ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు సిఐ తెలిపారు. ఈ దాడుల్లో రెవెన్యూ, ఎస్ఇబి సిబ్బంది ప్రవీణ్, శ్యామ్ పాల్గొన్నారు.

వెంకటాపురంలో చోరీ

కలిదిండి: వెంకటాపురంలో రహదారి వెంబడి ఉన్న ఫ్యాన్సీ షాపులో మంగళవారం తెల్లవారుజామున చోరీ జరిగింది. కొందరు దుండగులు షాపులోకి చొరబడి రూ.15 వేల నగదు, రూ.10 వేల విలువగల సరుకులు, జత బంగారు ముురుకులు అపహరించినట్లు బాధితుడు మారగాని శ్రీనివాస్ తెలిపారు. షాపు తాళం పగులగొట్టి అపహరణకు పాల్పడినట్లు తన సీసీ కెమెరాలో రికార్డ్ అయినట్లు గుర్తించాడు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాలికలకు అండగా ఉండాలి

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

బాలికలు అన్నిరంగాల్లోనూ రాణించాలని, వారికి ప్రతిఒక్కరూ అండగా నిలబడాలని డిఎంహెచ్ఒ డాక్టర్ నాగేశ్వరరావు అన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో మంగళవారం ప్రపంచ బాలిక దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎంహెచ్ఒ మాట్లాడుతూ బాలికలు తమ హక్కులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. బాలికల సంరక్షణ, చట్టాల గురించి వివరించారు. ఆర్‌బిఎస్‌కె జిల్లా కో-ఆర్డినేటర్, ఎన్‌సిడి జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ మానస మాట్లాడుతూ బాలికలు ఉన్నత చదువులు చదివి గొప్ప పదవులు అధిరోహించాలన్నారు. సమాజంలో ఆడపిల్లలు, మగ పిల్లలు సమానమేనని, ఆడపిల్లల పట్ల వివక్షత ఉండరాదన్నారు. ప్రపంచ బాలికల దినోత్సవ ప్రాధాన్యతను వివరించారు. బాలికలకు పౌష్టికాహారం, ఆరోగ్య సంరక్షణ, బాలికావిద్యను ప్రోత్సహించడం, ప్రభుత్వపథకాల్లో కన్యలను ప్రోత్సహించడం వంటి వాటిపై అవగాహన కల్పించాలన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖనం పోటీల్లో ప్రతిభ కనబరిచిన తొమ్మిది మంది బాలికలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ.10 వేలు, రూ.ఐదు వేలు, రూ. మూడు వేలు నగదు చెక్కుల రూపంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డెమో డి.నాగరత్నం, హెల్త్ ఎడ్యుకేటర్ విజయ్ కుమార్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ప్రియాంక, పలువురు ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.


ఏలూరులో..


భీమడోలు: ఆడపిల్లల సంరక్షణ లక్ష్యంగా ప్రతిఒక్కరూ కృషి చేయాలని భీమడోలు మానస ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ యలమర్తి రవీంద్రకుమార్ కోరారు. జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా పాఠశాలలో మంగళవారం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ సందర్భంగా కరస్పాండెంట్ మాట్లాడుతూ ఆడపిల్లలల హక్కులు, ఆరోగ్యం, విద్య, సామాజిక ఎదుగుదల అంశాలలో వారికి అండగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో భీమడోలు సచివాలయ సిహెచ్ఒ నాగదుర్గ, ఎఎన్ఎం, సుజని, చంద్రకళ, ఆరోగ్య సహాయకులు మురళీ పాల్గొన్నారు. అలాగే భీమడోలు హైస్కూల్లో జాతీయ బాలిక దినోత్సవాన్ని వైద్య ఆరోగ్య సిబ్బంది సహకారంతో యాజమాన్యం నిర్వహించింది.


భీమడోలులో...

చింతలపూడి : ఆడపిల్లలకు ప్రతిఒక్కరూ అండగా నిలబడాలని బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.చక్రధరరావు అన్నారు. పాఠశాలలో బాలికా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కలిదిండి : జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా స్థానిక మండల పరిషత్ పాఠశాల, అంగన్ వాడి కేంద్రం-2లో ఎంపిటిసి నీలి సుమన్ స్వీట్స్ పంపిణీ చేశారు. ఆడపిల్లలు చదువుకు దూరం కాకుండా చూడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. ఎంపిటిసి చాంద్ బాషా, బాబూరావు, అంగన్వాడీ కార్యకర్తలు విజయ, సరోజిని పాల్గొన్నారు.


కలిదిండిలో..


ఫిజియోథెరపీ చేస్తున్న ప్రశాంతి

వికలాంగులకు వ్యాయామం తప్పనిసరి

ప్రజాశక్తి - ముసునూరు

వికలాంగులు నిత్యం వ్యాయామం చేయడం వల్ల ఆరోగ్యవంతులుగా ఉంటారని ఫిజియోథెరపిస్ట్ జి.ప్రశాంతి అన్నారు. మంగళవారం ముసునూరు ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు హెచ్.అన్నామణి ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాయామంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నారాయణరావు, నాగమల్లేశ్వరి పాల్గొన్నారు.


మైక్‌సెట్ అందిస్తున్న ఫ్రెండ్స్ యూత్ సభ్యులు

పాఠశాలకు మైక్ సెట్ బహూకరణ

ప్రజాశక్తి - ఉంగుటూరు

అక్కుపల్లి గోకవరం ప్రాథమికోన్నత పాఠశాలకు ఫ్రెండ్స్ యూత్ సభ్యులు రూ.15వేలు విలువైన మైక్‌సెట్‌ను అందించారని ప్రధానోపాధ్యాయులు ఆనందరావు తెలిపారు. పాఠశాలలో మౌలిక సదుపాయాల కల్పన, అభివృద్ధికి గ్రామస్తులు, దాతలు సహకారం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఫ్రెండ్స్ యూత్ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రాధారాణి

మామిడి యాజమాన్య పద్ధతులపై అవగాహన

ప్రజాశక్తి - చాట్రాయి

చాట్రాయి రైతు భరోసా కేంద్రంలో మంగళవారం ఉద్యానవనశాఖ ఆధ్వర్యంలో మామిడిలో పూత, పిందె వచ్చు సమయంలో పాటించాల్సిన యాజమాన్య పద్ధతులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్త, మామిడి పరిశోధనా కేంద్రం నుండి విచ్చేసిన కె.రాధారాణి మాట్లాడుతూ మంచు వల్ల వచ్చే తెగులుకు హెక్సాకొనజోల్, తేనెమంచు పురుగు నివారణకు ఇమిడాక్లోపుడ్ మందును, తామర పురుగు నివారణకు ఫిప్రోనిల్ పిచికారీ చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా రాష్ట్ర కో-ఆపరేటివ్ యూనియన్ ఛైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి, శాంతి పాల్గొన్నారు.

చైతన్య యువజన సంఘం సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - భీమడోలు

పర్యావరణ పరిరక్షణకు భీమడోలు చైతన్య యువజన సంఘం చేస్తున్న సహాయ సహకారాలు అభినందనీయమని ఉపాధి హామీ భీమడోలు అదనపు ప్రోగ్రాం ఆఫీసర్ పద్మ అన్నారు. సంఘం అధ్యక్షులు డాక్టర్ పి.మాన్‌సింగ్ ఆధ్వర్యంలో జీవవైవిధ్య మండలి నర్సరీ పెంపకాన్ని భీమడోలులో చేపట్టారు. అయితే ఈ మొక్కలు చనిపోవడం గమనించిన ఎంపిడిఒ రాఘవన్ డివైడర్‌పై మొక్కలు పెంచేందుకు జీవవైవిధ్య మండలి సహకారం కోరారు. దీనిపై స్పందించిన నిర్వాహకులు డివైడర్‌తో పాటు దానికి రెండు పక్కలా గల రోడ్డు మార్గం. వెంబడి సుమారు 400 మొక్కలు నాటేందుకు సంసిద్ధత తెలిపారు. మంగళవారం వాటిని ఉపాధి హామీ సిబ్బందికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ పథకం భీమడోలు సహాయకులు చంద్రకాంతమ్మ పాల్గొన్నారు.

జగనన్న ఇళ్ల నిర్మాణం వేగవంతానికి చర్యలు

ప్రజాశక్తి - భీమడోలు


మాట్లాడుతున్న సోమేశ్వరరావు

జగనన్న గృహ నిర్మాణాలను వేగవంతం చేసేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించామని హౌసింగ్ డిఇఇ యు.సోమేశ్వరరావు తెలిపారు. మండలంలో ఇళ్ల నిర్మాణాల ప్రగతిపై ఆయన మంగళవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో పంచాయతీ అధికారులు, గ్రామస్థాయి, రెవెన్యూ అధికారులు, సచివాలయ సిబ్బంది, వివిధ శాఖలకు చెందిన అధికారులతో సమీక్షించారు. ఎంపిడిఒ రాఘవన్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో డిఇఇ మాట్లాడుతూ భీమడోలు మండలానికి కేటాయించిన 2086 జగనన్న ఇళ్లల్లో 681 ఇళ్లు ప్రారంభం కాలేదన్నారు. దీనికి వివిధ కారణాలు అడ్డంకిగా ఉన్నట్లు గుర్తించామన్నారు. వీరుకూడా గృహ నిర్మాణాలు ప్రారంభించేలా ప్రభుత్వం కేటాయించే మొత్తాలతో పాటు డ్వాక్రా రుణాలతో ఇళ్లు చేపట్టే పరిస్థితిలో లేనివారి విజ్ఞప్తి మేరకు గృహనిర్మాణ సంస్థ లబ్ధిదారులకు, నిర్మాణాలు చేపట్టే గుత్తేదారులకు మధ్య మధ్యవర్తిత్వం వహించి గృహ నిర్మాణాలు ప్రారంభించేందుకు చర్యలు చేపట్టిందన్నారు. దీన్ని గృహ నిర్మాణ పథకం ఆప్షన్-3గా గుర్తించామన్నారు. ఈ మేరకు ఆ తరహాలో గృహ నిర్మాణాల కోసం గుండుగొలను లేఅవుట్‌లోనే 200 మంది లబ్ధిదారులు సంసిద్ధత వెలిబుచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాన్స్‌కో ఎఇఇ రామస్వామి, పిఆర్ఎఇ డి.సత్యనారాయణ, వైఎస్ఆర్ క్రాంతి పథం భీమడోలు ఎపిఎం సురేష్ కుమార్, ఎపిఒ పద్మ పాల్గొన్నారు.

బ్యాడ్జీలతో బ్యాంకు ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి - టి.నరసాపురం


ఆందోళన చేస్తున్న ఉద్యోగులు

బ్యాంకు ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని టి.నరసాపురం యూనియన్ బ్యాంక్ మేనేజర్ హరికృష్ణ డిమాండ్ చేశారు. స్థానిక యూనియన్ బ్యాంక్ ఎదురుగా ఉద్యోగులు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా హరికృష్ణ మాట్లాడుతూ యూనియన్ బ్యాంక్ ఉద్యోగులకు ఐదు రోజుల పనివారాలను అమలు చేయాలని, పాత పెన్షన్ విధానం తీసుకురావాలని, బ్యాంకుల్లో ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలు పరిష్కారం కోసం ఈనెల 30, 31 తేదీల్లో ధర్నా చేస్తున్నామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ అశోక్ రెడ్డి, క్యాషియర్ శివరాజు, కౌంటర్ క్లర్క్ గోపాల్ దేవ్, లత, యు.సాగర్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మోడీకి గుణపాఠం తప్పదు

సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం



ధర్నా చేస్తున్న సిపిఐ నేతలు

కేంద్రంలో మోడీ అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు ప్రజలు తగిన గుణపాఠం చెప్పే సమయం ఆసన్నమైందని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ అన్నారు. విశాఖ ఉక్కు ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ సిపిఐ, ఎఐటియుసి ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక రెవెన్యూ డివిజనల్ కార్యాలయం ఎదుట నిరసన దీక్ష చేపట్టారు. ఈ దీక్షలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న వనజ మాట్లాడుతూ విశాఖ హక్కు ఆంధ్రుల హక్కు, విశాఖ ఉక్కు ప్రయివేటీకరణను నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఆస్తులను, పరిశ్రమలను కార్పొరేట్ శక్తులకు కారు చౌకగా ధారాదత్తం చేయడానికి బిజెపి ప్రయత్నిస్తుందని విమర్శించారు. ఎంతోమంది ప్రాణ త్యాగం చేసి సాధించుకున్న విశాఖ ఉక్కును పరిరక్షించుకోవాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం సహకారం లేకున్నా, సొంత గనులు కేటాయించకపోయినా అభివృద్ధి నడుస్తున్న ఉక్కు కర్మాగారాన్ని ప్రయివేటుపరం చేస్తామనడం దుర్మార్గమైన చర్య అన్నారు. కేంద్ర ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తుందని దీన్ని ధీటుగా ఎదుర్కోవాలని కోరారు. ప్రజల జీవన ప్రమాణాలకు మూలాధారమైన ప్రభుత్వరంగ పరిశ్రమ విశాఖ ఉక్కు కర్మాగారంపై కేంద్ర వైఖరికి వ్యతిరేకంగా రాజకీయ ఉద్యమం ఉధృతం చేస్తామన్నారు. అనంతరం సిపిఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మునీర్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కన్వీనర్ నన్నేపల్లి సాయిబాబు, గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి కారం దారయ్య, సిపిఐ బుట్టాయగూడెం మండల కార్యదర్శి సోదెం వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.


ప్రశంసాపత్రాలతో విద్యార్థులు

శ్రీచైతన్య విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - భీమడోలు

విజయవాడకు చెందిన విజిఆర్ డయాబెటిక్ కేర్ ఆధ్వర్యంలో డయాబెటిక్ కేర్ అంశంపై నిర్వహించిన రాష్ట్రస్థాయి వ్యాసరచన పోటీల్లో భీమడోలు చైతన్యపాఠశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారని ప్రిన్సిపల్ డి.సోని అన్నారు. భీమడోలు కేంద్రంగా చైతన్య పాఠశాలల్లో ఆరో తరగతి నుంచి పదో తరగతి విద్యార్థులకు వ్యాసరచన పోటీలను ఇటీవల నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతిభకనబరిచిన పాఠశాల విద్యార్థులకు చెందిన 12 మందికి మెమెంటోలు, ప్రశంసాపత్రాలు మంగళవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ చైతన్య విద్యాసంస్థల సమన్వయకర్త జి.ఉదయభాస్కర్, ఆర్ఐ పార్థసారథి పాల్గొన్నారు.

వైభవంగా వెంకటేశ్వరస్వామి వార్షికోత్సవం

ప్రజాశక్తి - ఉంగుటూరు

నారాయణపురంలోని వెంకటేశ్వరస్వామి ఆలయ దశమ వార్షికోత్సవంలో భాగంగా మూడోరోజు మంగళవారం శాంతి హోమం, చక్రస్నానం వైభవంగా జరిగింది. ఉదయం శాంతి హోమం, అనంతరం ఉత్సవమూర్తుల ఊరేగింపు నిర్వహించారు. ఏలూరు కాలువలో స్వామివారికి చక్రస్నానం ఆగమ అర్చకులు వేద మంత్రాల నడుమ వైభవంగా నిర్వహించారు. గోదావరి జలాలతో స్వామివారికి అభిషేకాలు నిర్వహించారు.